



# కరపత్రం

SINCE 2014

మంగళవారం నవంబర్ 19 2024 | సంపుటి :0 | సంచిక : 41 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# మహారాష్ట్రను దోచుకునేందుకు పెద్ద ప్లాన



- ఇద్దరు గుజరాతీలను నమ్మకుంటే జరిగేది అదే
- తెలంగాణలో అన్ని గ్యారెంటీలు అమలు చేస్తున్నాం
- ఇక్కడా కాంగ్రెస్ కూటమి గెలిస్తే పథకాల అమలు
- పుణెలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి

ఇద్దరు గుజరాతీలు దేశంలోనే రెండో అతిపెద్ద రాష్ట్రమైన మహారాష్ట్రను దోచుకునేందుకు ప్లాన్ చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 11 ఏండ్లలో మహారాష్ట్రకు మోదీ సర్కారు చేసిందేమీ లేదని అన్నారు. ఒకప్పుడు అంబానీ, అదాని కోసం పనిచేసేవారని, ఇప్పుడు కేవలం అదానీ కోసమే పనిచేస్తున్నారంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ లలో గ్యారెంటీలన్నీ అమలు చేశామని పునరుద్ఘాటించారు. మహారాష్ట్ర ప్రచారంలో భాగంగా పుణెలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ ఆర్థిక రాజధాని ముంబై అడ్డాగా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ.. కోవర్ట్ ఆపరేషన్ తో మహారాష్ట్రను విద్రోహుల అడ్డాగా మార్చారని అన్నారు. కేంద్ర మంత్రి ఆధ్వర్యంలో ఓ కమిటీ ఏర్పాటు చేసి హైదరాబాద్ వస్తే తాను సచివాలయంలో కూర్చోబెట్టి ప్రతి విషయాన్ని గణాంకాలతో సహా వివరించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. తప్పని నిరూపిస్తే క్షమాపణ కోరుతానని అన్నారు. మోదీ ప్రధానమంత్రి అయ్యాక కార్పొరేట్ కంపెనీల అప్పులు రూ.16 లక్షల కోట్లు మాఫీ చేశారని, తాము రైతులకు రుణమాఫీ చేస్తే బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నారని అన్నారు.

చిన్న కార్యకర్త శిందేను బాలాసాహెబ్ మంత్రి వరకు తీసుకువస్తే ఆయనను ఉద్ధవ్ ఠాక్రేకు వ్యతిరేకంగా మోదీకి గులాంగా మారారని, శరద్ పవార్ సొంత బిడ్డను కాదని సోదరుని కుమారుడు అజిత్ పవార్‌కు మంత్రి పదవులు ఇస్తే ఆయనను మోదీకి గులాంగా మారారని ఆరోపించారు. అశోక్ చవాన్‌ను కాంగ్రెస్ ముఖ్యమంత్రి చేస్తే ఆయన మోదీకి గులామయ్యారన్నారు.

వివరాలు 2లో

## హామీల అమలులో రేవంత్‌రెడ్డి డకౌట్ : హరీశ్‌రావు

- కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి డకౌట్ అయ్యారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు.
- పేదోళ్ల ఇండ్లు కూలగొట్టడమే రేవంత్ హిట్ వికెట్ అని పేర్కొన్నారు.



2లో

## ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా హరిచందన

రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు విషయంలో కీలక ముందడుగు పడింది. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారిణి హరిచందనను తెలంగాణ ప్రభుత్వం

2లో

# కేసీఆర్, రేవంత్‌రెడ్డి

## నైతిక విలువలు వదిలేశారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



- భారాస, కాంగ్రెస్ పార్టీలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు

గతంలో భారాస ప్రభుత్వం ఎలా ఉందో.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కూడా అలాగే ఉందన్నారు. అదే రకమైన అవినీతి, గాలి మాటలు విని ప్రజలు విసిగిపోతున్నారన్నారు. కేసీఆర్ , రేవంత్‌రెడ్డి రాజకీయాల్లో నైతిక విలువలు వదిలేశారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల మేర అప్పులు చేశారన్నారు.

## వేములవాడ అభివృద్ధికి రూ.127.65 కోట్లు మంజూరు



2లో

వేములవాడలో అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.127.65 కోట్లు మంజూరు చేసింది.

## శ్రీవాణి ట్రస్టు రద్దు.. రెండు మూడు గంటల్లో దర్శనం.. తితిదే కీలక నిర్ణయాలు



2లో

తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ధర్మకర్తల మండలి సమావేశం ముగిసింది. సమావేశంలో శ్రీవాణి ట్రస్టు రద్దుతోపాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

# లగచర్లలో దాడి చేసింది

## కేటీఆర్ అనుచరులే: మంత్రి కోమటిరెడ్డి

- వికారాబాద్ జిల్లా లగచర్లలో ఘర్షణకు దిగింది కేటీఆర్ అనుచరులేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు.
- గతంలో తాము కూడా ఎన్నో నిరసనలు, ఉద్యమాలు చేశామని, ఏనాడూ పోలీసులు, కలెక్టర్లపై దాడికి పాల్పడలేదన్నారు.




2లో

## కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పనిని కూడా కక్షపూరితంగా చేయదు: మంత్రి పొంగులేటి




హైదరాబాద్: గత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. మంచి ప్రతిపక్షంగా విలువైన సూచనలు ఇస్తే.. స్వీకరిస్తామన్నారు. ఎంతో దూరదృష్టితో కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేను చేపట్టిందని చెప్పారు. అయితే, గత ప్రభుత్వం సమగ్ర సర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పనిని కూడా కక్షపూరితంగా చేయడం లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలోని నేతలు చేసిన అక్రమాలపై చట్టపరంగానే చర్యలుంటాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

## సువర్ణ భూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఎండీపై ఫిర్యాదు




హైదరాబాద్: సువర్ణ భూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఎండీ శ్రీధర్‌పై హైదరాబాద్ సీసీఎస్‌లో విశ్రాంత ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. పెట్టుబడి పేరుతో మోసగించారని సాఫ్ట్‌వేర్, విశ్రాంత ఉద్యోగులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బై బ్యాక్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట దాదాపు రూ.కోటి మేర వసూలు చేశారని.. ఏడాదిన్నర తర్వాత 25 శాతం అధికంగా చెల్లిస్తామని తెలిపారని బాధితులు చెప్పారు. స్కీమ్ కాలవ్యవధి దాటినా డబ్బులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎలాగైనా తమకు న్యాయం చేయాలని బాధితులు ఫిర్యాదులో కోరారు.

## వారం కిందట అదృశ్యమై.. తుక్కుగూడలో శవమై కనిపించి..



హైదరాబాద్: నగరంలోని మియాపూర్‌లో అదృశ్యమైన అమ్మాయి (17) మృతదేహం లభ్యమైంది. తుక్కుగూడలోని ప్లాస్టిక్ పరిశ్రమ వద్ద మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. నవంబర్ 10న అమ్మాయి

# లగచర్లలో దాడి చేసింది

## కేటీఆర్ అనుచరులే: మంత్రి కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా శాంతియుతంగా ఆందోళన చేస్తే తప్పు లేదన్నారు. అయితే, లగచర్లలో భూములు లేని స్థానికేతరులను తీసుకొచ్చి గొడవ చేయించారని మండిపడ్డారు. నిందితుడు సురేశ్ మాజీ ఎమ్మెల్యేతో 90 సార్లు మాట్లాడారని అన్నారు. రేప్ కేసులో నిందితుడిగా ఉన్న సురేశ్ తన అనుచరుడేనని కేటీఆర్ కూడా గతంలో అంగీకరించినట్లు చెప్పారు.

"మూసీ పునరుజ్జీవంపై భారాస రాద్ధాంతం సృష్టిస్తోంది. మూసీ పునరుజ్జీవం వద్దని మాజీ సీఎం కేసీఆర్ బయటకు వచ్చి చెప్పాలి. అలా చెప్తే పనులు ఆపేస్తాం. ఆర్ఆర్ఆర్‌కు ఇప్పటికే 90శాతం భూసేకరణ పూర్తి చేశాం. దీనికి సంబంధించి జనవరిలో టెండర్లు పిలుస్తాం. రైతులకు భూ పరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభిస్తాం. రూ. వేల కోట్లు వచ్చే ఓఆర్ఆర్‌ను కేవలం రూ.7 వేల కోట్లకే అప్పగించారు. గత ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టును 2016 నుంచి పెండింగ్‌లో పెట్టింది. ఆర్ఆర్ఆర్ భూసేకరణకు ఇచ్చే నిధులపై కేంద్రం స్పష్టత కోరితే ఇవ్వలేదు. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఈ ప్రాజెక్టుపై అడుగు ముందుకు పడలేదు.

ఓఆర్ఆర్ వల్లే ఆర్ఆర్ఆర్ కూడా హైదరాబాద్, తెలంగాణకు గేమ్‌ఛేంజర్ అవుతుంది. శ్రీశైలం క్షేత్రానికి రూ.7 వేల కోట్లతో ప్రాజెక్టు సాధించనున్నాం. శ్రీశైలానికి రిజర్వ్ ఫారెస్ట్ గుండా 62 కి.మీ మేర సింగిల్ పిల్లర్ ఫ్లై ఓవర్ ప్రాజెక్టు సాకారం అవుతుంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మూసీ ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యారు, యాదాద్రి జిల్లాలో పర్యటించాలి. కేంద్రమంత్రిగా సింగరేణి గురించి ఎందుకు ఆలోచించటం లేదు? మణిపుర్ ఘర్షణల గురించి ఈ కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడరు?" అని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

## ఇమామ్‌లు, మౌజమ్‌లకు గౌరవ వేతనం కొనసాగిస్తాం: ఏపీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



అమరావతి: ఇమామ్‌లు, మౌజమ్‌లకు గౌరవ వేతనం ఇవ్వడాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని ఏపీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో ఈ మేరకు ఆయన వెల్లడించారు. పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనం తెదేపా ప్రభుత్వమే ప్రారంభించిదని గుర్తుచేశారు. ముస్లింలు హజ్ యాత్రకు వెళ్తే ఇచ్చే ఆర్థిక సాయాన్ని కొనసాగిస్తామన్నారు. గతంలో యాత్రకు వెళ్లి వచ్చినవారికి ఇవ్వాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికే రూ.లక్ష అందజేస్తామని ఫరూక్ తెలిపారు.

## కోల్‌కతా ఘటన.. నిందితుడి గొంతు వినిపించకుండా పోలీసుల హారన్లు..!




ఇంటర్నెట్ డెస్క్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా హత్యాచార ఘటన ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సంజయ్ రాయ్ విషయంలో పోలీసులు కాస్త చిత్రంగా ప్రవర్తించారు. అతడి కేకలు మీడియాకు వినిపించకుండా ఏకధాటిగా హారన్లు మోగించారు. ఇంతకీ అలా ఎందుకు చేశారంటే..?

నవంబర్ 11న కోర్టుకు తీసుకువచ్చినప్పుడు సంజయ్ రాయ్ సంచలన ఆరోపణలు చేశాడు. ఈ కేసులో తనను ఇరికించారని, తనకు వ్యతిరేకంగా కోల్‌కతా మాజీ పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్ కుట్ర పన్నారని సంజయ్ పోలీసు వ్యాన్ నుంచి గట్టిగట్టిగా కేకలు వేశాడు. తాను నిర్దోషినని కోర్టు నుంచి తీసుకెళ్తున్న సమయంలో అతడలా అరిచాడు.

## ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా హరిచందన

హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు విషయంలో కీలక ముందడుగు పడింది. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారిణి హరిచందనను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. అంతేకాకుండా వరంగల్ భూగర్భ డ్రైనేజీ పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద రూ.4,170 కోట్లతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నారు. మరోవైపు ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం విషయంలో ప్రాజెక్టు కన్సల్టెంట్ నియామకానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. కన్సల్టెంట్ నియామకానికి టెండర్లు చేపట్టేందుకు ఆర్అండ్‌బీకి అధికారమిస్తూ జీవో జారీ చేసింది.

## మహారాష్ట్రను దోచుకునేందుకు పెద్ద ప్లాన

మొదటిపేజీ తరువాయి

ముంబయిలోని ధారావిని కబ్జా చేసేందుకు విద్రోహులైన శిందే, అజిత్ పవార్, అశోక్ చవాన్‌ను వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. 12 కోట్ల మహారాష్ట్ర ప్రజలకు తాను విజ్ఞప్తి చేస్తున్నానని, ఇది ఎన్నిక కాదని, ధర్మయుద్ధమని అన్నారు. ప్రజలు ఆలోచించి వచ్చే ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీకి (ఎంవీఏ) ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ లో విభేదాలంటూ వాట్సాప్ యూనివర్సిటీలో బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. హిమాచల్ ప్రదేశ్‌లో 95 శాతానికిపైగా ప్రజలు హిందువులు.. వారు బీజేపీకి ఓటు వేయలేదని అన్నారు. మహారాష్ట్ర ప్రజలు కూడా కాంగ్రెస్ ను ఆదరిస్తారనే సంపూర్ణ విశ్వాసం తనకు ఉందని చెప్పారు.

తెలంగాణలో యువతకు 50 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ఎల్‌బీ నగర్ స్టేడియంలో స్వయంగా నేను నియామక పత్రాలు అందించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా పుణెలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పదకొండేళ్ల పాలన తర్వాత కూడా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వానికి చెప్పుకోవడానికి ఒక సక్సెస్ స్టోరీ లేదన్నారు. ఈ పదకొండేళ్లలో కేంద్ర ప్రభుత్వానికి, ఇక్కడ మహారాష్ట్రలోని మహాయుతి ప్రభుత్వానికి చెప్పుకోవడానికి ఒక్క విజయగాథ లేదని

తెలిపారు. ప్రతిసారి బాంబు పేలుళ్లు.. ఇతర కొత్త కొత్త అంశాలను ప్రధానమంత్రి మోదీ.. బీజేపీ ఎన్నికల ముందుకు తెరపైకి తెస్తున్నాయి.. చెప్పుకోవడానికి ఏం లేకనే వాటిపై ఆధారపడుతున్నారని తెలిపారు. 2014 ఎన్నికలకు ముందు రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, 2002కు ముందే దేశంలోని ప్రతి పేదవానికి ఇల్లు నిర్మిస్తామని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయకపోగా వారికి వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలు తెచ్చారని తెలిపారు.

16 నెలల పాటు రైతులు ధర్నాలు, ఆందోళనలు చేశారన్నారు. ఆ సమయంలో 700 మందికిపైగా రైతులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రలోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు? ఈ విషయంపై ప్రధానమంత్రి మాట్లాడరు..? అని ప్రశ్నించారు. నేను ఎంపీగా ఉన్నప్పుడు 2 కోట్ల ఉద్యోగాలపై లోక్‌సభలో ప్రశ్నించా అన్నారు. కేవలం 7.50 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని సమాధానం ఇచ్చారు? అంటే పదకొండేళ్ల పాలనలో ఒక్క శాతం ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రైతులు, పేదలు, ఉద్యోగాల విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇచ్చిన హామీలంటిన్నిలో విఫలమైన నరేంద్ర మోదీ తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ ల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో తాను సవాల్ విసురుతున్నా అన్నారు. కేంద్ర మంత్రి లేదా కేంద్ర ఉన్నతాధికారి ఆధ్వర్యంలో ఒక కమిటీ వేసి తెలంగాణకు పంపాలని తెలిపారు. వాళ్లకు వివరాలు ఇస్తాం.. అవసరమైతే వారి విమాన ఖర్చులు మేమే భరిస్తామన్నారు. మేము 50 రోజుల్లో రైతుల రుణ ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేసి రుణ మాఫీ చేశాం? ప్రతి రైతు ఖాతా వివరాలు అందిస్తామన్నారు. తెలంగాణలో యువతకు 50 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. ఎల్‌బీ నగర్ స్టేడియంలో స్వయంగా నేను నియామక పత్రాలు అందించా అన్నారు. తెలంగాణలో మహిళలు ఎక్కడి నుంచైనా ఎక్కడి వరకైనా ఉచితంగా ప్రయణించే అవకాశం కల్పించాలన్నారు. ఇప్పటికే కోట్లాది మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. 2004లో సోనియా గాంధీ సూచన మేరకు దీపం పథకం కింద రూ.400 కే గ్యాస్ సిలిండర్..స్టవ్ కేంద్ర ప్రభుత్వం అందజేసిందన్నారు. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత రూ.400 గ్యాస్ సిలిండర్‌ను రూ.1200కు పెంచారన్నారు. సిలిండర్ ధర పెంపు ద్వారా పేద మహిళలు రూపాయి రూపాయి వంటింట్లో దాచుకున్న డబ్బును మోడీ చోరీ చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో పేద మహిళలకు రూ.500కే సిలిండర్ ఇస్తున్నాం? 50 లక్షల కుటుంబాలు రూ.500కే సిలిండర్ ఇస్తున్నాం.. కావాలంటే ఆ వివరాలు అందిస్తామన్నారు.

రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్నాం.. పట్టణాలు, పల్లెల్లో పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తున్నామన్నారు. స్వాతంత్యం÷-ర వచ్చిన తర్వాత ఏ రాష్ట్రంలోనూ రానంత ధాన్యం దిగుబడి తెలంగాణలో ఈ సారి వచ్చిందన్నారు. మొత్తం 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది.. ఎమ్మెస్పీకి అదనంగా రైతులకు ప్రతి క్వింటాకు మా ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందించేందుకు గానూ సోనియా గాంధీ నేతృత్వంలో దేశంలోనే మొదటి సారిగా రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ఇప్పుడు దానిని తెలంగాణలో మేం రూ.10 లక్షలకు పెంచాం. పేదల వైద్యానికి ఇప్పటి వరకు రూ.50 వేల కోట్లు తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. మా గ్యారంటీలు కచ్చితమైన గ్యారంటీలు.. మోదీ గ్యారంటీలు కాదు.. భారతీయ జుటా పార్టీ గ్యారంటీలు కాదన్నారు. తెలంగాణ ఇస్తానని సోనియా హామీ ఇచ్చారు.. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ దెబ్బతింటదని తెలిసినా ఇచ్చారన్నారు. ఈ రోజుతో ఎన్నికల ప్రచారం

ముగుస్తున్నందున మోడీ.. బీజేపీ నాయకులు రేపు హైదరాబాద్ వస్తే సచివాలయంలో కూర్చోబెట్టి నేను చెప్పిన ప్రతి అంశం వివరాలు అందజేస్తా?అందులో ఏమైనా తప్పు ఉంటే క్షమాపణలు చెబుతా అన్నారు.

మహారాష్ట్రలో ఎంవీఏను గెలిపిస్తే తెలంగాణలో అమలవుతున్న అన్ని హామీలు మహారాష్ట్రలో అమలవుతాయన్నారు. విలేకరుల ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి జవాబులు అన్నారు. మైనారిటీ రిజర్వేషన్లు చట్టపరంగా చేయాల్సినవి? తెలంగాణలో మేం 4 శాతం అమలు చేస్తున్నాం.. ఇక్కడ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇక్కడ చర్చించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. మోడీకి కేంద్రంలో పదకొండేళ్లలో విజయ గాథ లేదు.. గుజరాత్‌లోనూ లేదు.. చరిత్రలో మహారాష్ట్ర గురించి శివాజీ.. అంబేద్కర్ తదితరుల గొప్పతానాన్ని చదువుకున్నారని తెలిపారు. ఇప్పుడు మీరు షిండే.. అజిత్ పవార్ గురించి ఏం చెప్పాలనుకుంటున్నారు..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ లో విభేదాలంటూ బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ తప్పుడు ప్రచారం చేస్తోందని కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలోనూ జూనియర్లు.. సీనియర్లు అని ప్రచారం చేశారన్నారు.

## ప్రధాని వ్యాఖ్యలను ఖండించిన రాహుల్‌గాంధీ



దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేయడంపై ఆ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. మోదీ ఇచ్చిన 'సేఫ్' నినాదాన్ని ఖండించారు. ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రధానిపై విమర్శలు గుప్పించారు.

మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్న ప్రధాని కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. 'ఏక్ హై తో సేఫ్ హై' (ఐక్యంగా ఉంటేనే మనమంతా సురక్షితంగా ఉంటాం) అని ప్రజలకు పిలుపునిచ్చారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందిస్తూ.. "పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే మోదీ సర్కార్ పని చేస్తోంది. పేదల గురించి వారికి ఎలాంటి ఆలోచన లేదు. ధారావిలోని నివాసితుల ప్రయోజనాలను విస్మరించారు. మహారాష్ట్రలో ఎంవీఏ కూటమి అధికారంలోకి వచ్చాక అక్కడి ప్రజలకు భూములను తిరిగి అప్పగిస్తుంది" అని రాహుల్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే వారికే ప్రాజెక్టులను అప్పగించాలంటూ కేంద్ర ఏజెన్సీలు పారిశ్రామికవేత్తలపై ఒత్తిడి తీసుకొస్తున్నాయని కాంగ్రెస్ నేత ఆరోపించారు. "ప్రధాని ఇచ్చిన సేఫ్ నినాదంపై ఒక సందేహం ఉంది. ఐక్యంగా ఉంటేనే సురక్షితం అన్నారు. ఇక్కడ ఎవరి సురక్షితంగా ఆయన మాట్లాడారు" అని ప్రశ్నించారు. ధారావిలో రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ టెండర్ల ప్రక్రియ కొందరి ప్రయోజనల కోసమే రూపొందించారు అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.

## హామీల అమలులో

### రేవంత్‌రెడ్డి డకౌట్ : హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్, తుర్కయాంజల్ జేబీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ ఛాంపియన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గెలిచిన టీం కాదు, ఓడిపోయిన టీం కూడా బాగా ఆడారు. గెలుపోటములు చాలా సహజం. భవిష్యత్తులో గెలుపు కోసం పోరాటం చేయాలి. ఆరు గ్యారెంటీలు బంద్ పెట్టి మూసీ దుకాణం మొదలు పెట్టిండు రేవంత్ రెడ్డి. 31 ఎస్టీపీలు, రూ. 3800 కోట్లతో మూసీ అభివృద్ధిని కేసీఆర్ ప్రారంభించాడు. కాళేశ్వరం ద్వారా గోదావరి నీళ్లను రూ. 1100 కోట్లతో మూసీలో పోయాలని ప్లాన్ చేశారు. మూసీ శుద్ధి చేయాలంటే గోదావరి నీళ్లు తేవాలి. అంతేగాని గరీబోళ్ల ఇల్లు కూలగొట్టడం కాదు. మూసీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తా అంటే బీఆర్ఎస్ ఊరుకోదు అని హరీశ్‌రావు హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలు అన్నడు మోసం చేసిండు. పింఛన్లు, విద్య భరోసా కార్డు, ఉద్యోగాలు ఏవీ లేవు. ఇప్పటి వరకు ఒక్క విద్యార్థికి కూడా స్కాలర్‌షిప్ డబ్బులు ఇవ్వలేదు. డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రతి సంవత్సరం రూ. 20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. ఏడాది అవుతున్నది ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు రేవంత్ అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## కేసీఆర్, రేవంత్‌రెడ్డి

### నైతిక విలువలు వదిలేశారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

రేవంత్ ఏకంగా అప్పుల కోసం ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారని మండిపడ్డారు."రైతు భరోసా, రుణమాఫీ లేదు. పింఛన్లు పెంచుతామన్నారు.. ఒక్క రూపాయి పెంచలేదు, కొత్త పింఛన్లు ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. హామీలన్నీ ఆయన గాలికొదిలేశారు. పైగా మహారాష్ట్రలో నిర్వహిస్తున్న ప్రచారంలో తెలంగాణ సస్యశ్యామలం అయిందంటూ మాట్లాడుతున్నారు. ఇంతకంటే అబద్ధాలు ఉంటాయా? కాంగ్రెస్, భారాస తమ వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. భాజపా (%దీపూ%) నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని భాజపా పోలింగ్ బూత్ కమిటీల నియామకం చేపట్టాలి. మళ్లీ మండల స్థాయి వర్క్‌షాపులు ఉంటాయి. ఈ నెల 22న దిల్లీలో జరగనున్న పార్టీ సంస్థాగత సమావేశాల్లో మండల, జిల్లా ఎన్నికల తేదీలు వస్తాయి. తెలంగాణలో పనిచేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. దేశంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉండి భ్రష్టు పట్టించింది" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## వేములవాడ అభివృద్ధికి రూ.127.65 కోట్లు మంజూరు

హైదరాబాద్:శ్రీరాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తుల సదుపాయాలకు రూ.76 కోట్లు కేటాయించింది. వేములవాడ ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్ల విస్తరణ చేపట్టనున్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణకు ప్రభుత్వం రూ.47.85 కోట్లు మంజూరు చేసింది. బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల వరకు డ్రైనేజీ నిర్మాణానికి రూ.3.8 కోట్లు కేటాయించింది.

## శ్రీవాణి ట్రస్టు రద్దు.. రెండు మూడు గంటల్లో దర్శనం.. తితిదే కీలక నిర్ణయాలు

మొదటిపేజీ తరువాయి

తిరుమల: సర్వదర్శనానికి వచ్చే భక్తులకు 2 నుంచి 3 గంటల్లోగా దర్శన భాగ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తితిదే నిర్ణయించింది. తితిదేలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగులను ప్రభుత్వానికి అప్పగించనుంది. ఈ మేరకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీవాణి ట్రస్టు రద్దు చేయాలని నిర్ణయించారు. సమావేశం వివరాలను బీఆర్ నాయుడు మీడియాకు వెల్లడించారు.

శ్రీనివాస సేతు పైవంతెనకు గరుడ వారధిగా నామకరణం చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. " తిరుమల డంపింగ్ యార్డులోని చెత్తను 3 నెలల్లో తొలగిస్తాం. తిరుమలలో రాజకీయాలు మాట్లాడకుండా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు బ్యాంకుల్లో నగదును ప్రభుత్వ బ్యాంకుల్లోకి బదలాయిస్తాం. శారదాపీఠం లీజును రద్దు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం. పర్యాటకం ద్వారా దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేస్తున్నాం. నూతనంగా నిర్మిస్తున్న ముంతాజ్ హోటల్ అనుమతులు రద్దు చేస్తున్నాం. తిరుపతి ప్రజలకు ప్రతినెల మొదటి మంగళవారం దర్శనానికి అవకాశం కల్పిస్తాం" అని బీఆర్ నాయుడు పేర్కొన్నారు.

## వారం కిందట అదృశ్యమై.. తుక్కుగూడలో శవమై కనిపించి..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: నగరంలోని మియాపూర్‌లో అదృశ్యమైన అమ్మాయి (17) మృతదేహం లభ్యమైంది. తుక్కుగూడలోని ప్లాస్టిక్ పరిశ్రమ వద్ద మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. నవంబర్ 10న అమ్మాయి కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సోమవారం మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలికి ఉప్పుగూడకు చెందిన ఓ యువకుడితో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇన్‌స్టాలో పరిచయం అయిన ఆ యువకుడే హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# తిట్లు .. ఆరోపణలు

## ఇంతే రా..జకీయము..తిరిగే రంగుల రాట్నం

– శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

తెలంగాణ రాజకీయాలను క్లాసికల్, మాస్, ఊర మాస్ అనే మూడు వర్గాలుగా విభజించవచ్చు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీఆర్ రాజకీయ రంగ ప్రవేశం చేసే వరకు మొత్తం రాజకీయం పెత్తందార్ల చేతుల్లోనే ఉండేది.ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టి బలహీన వర్గాలను ప్రోత్సహించే వరకు అంతా ఉన్నత వర్గాలదే పెత్తనం.ఎన్టీఆర్ ప్రత్యర్థులను గ్రాంథిక భాషలో కుక్క "మూతి పిందెలు" అంటూ మర్యాదగా క్లాసికల్ భాషలో తిట్టేవాడు.కేసీఆర్ "కిలో మీటర్ లోతులో బొంద పెడతాం". సన్నాసులు వెధవలు అంటూ తిడుతూ "మాస్ మహారాజ" అయ్యాడు.కేసీఆర్ ను తట్టుకోవాలని సంజయ్ ముఖ్యంగా రేవంత్ రెడ్డి "ఊర మాస్" అవతారం ఎత్తారు.తెలంగాణ రాష్ట్ర విభజన ఆకాంక్ష పోరాట రూపం సంతరించుకున్న తర్వాత కేసీఆర్ కొత్త కొత్త తిట్లతో మాస్ కు ఊపు వచ్చింది.కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీ పెట్టిన తర్వాత రాజకీయంలో తిట్ల దండకం ప్రారంభమయ్యింది.తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజావేశానికి కేసీఆర్ తిట్ల పురాణం చెవులకు ఇంపుగా సోకింది.ఈ తిట్ల పురాణ పఠనంతో కేసీఆర్ "మాస్ మహారాజా" గా గుర్తింపు తెచ్చుకుని తిట్ల పై పేటెంట్ హక్కు సంపాదించాడు.కేసీఆర్ ప్రేరణతో తెలంగాణలో "తిట్ల దండు" కొత్తగా రూపుదిద్దుకున్నది. కేసీఆర్ ను అనుసరిస్తూ తిట్ల పారాయణం చేసే వారే నాయకులుగా పరిగణించడం మొదలయ్యింది.తెలంగాణ ఏర్పడిన తర్వాత రెండు పర్యాయాలు టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చింది.తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పెత్తనం స్థిరపడిన తర్వాత టీఆర్ఎస్ పట్ల వ్యతిరేకత ప్రారంభమయింది.కాని కేసీఆర్ తిట్ల శైలికి తెలంగాణ ప్రజలు బాగా ఆకర్షితం అవడంతో, ప్రతిపక్ష పోరాటాలకు ఆదరణ కనిపించలేదు.ఇక కేసీఆర్ శైలి లోనే ప్రతిపక్షం తిట్ల దండకం ప్రాక్టీస్ చెయ్యడం




మొదలయ్యింది.కేసీఆర్ ను ఎలా ఎదుర్కోవాలో తెలియక బిజెపి అయోమయం చెందుతున్న దశలో బండి సంజయ్ ఒక ఆశాకిరణంలా టీఆర్ఎస్ కు ధీటుగా జనానికి కనిపించాడు.ఈ తిట్ల పోటీలో ప్రవేశించిన రేవంత్ రెడ్డి ఈ తిట్ల ఆటలో స్టార్ డం సంపాదించాడు.ఇక ఎవరు ఎక్కువ తిడితే వారే గొప్ప నాయకుడు అనే స్థితికి తెలంగాణ ప్రజలు వచ్చేసారు.ఈ ఇద్దరు తిట్ల పోటీలో "ఊర మాస్" బిరుదు పొందారు.గత సం జరిగిన ఎన్నికల పోటీలో మొత్తానికి రేవంత్ మొదటి స్థానం పొంది విజేతగా నిలిచాడు.కాని "తిరిగే కాలు, తిట్టే నోరు ఊరుకోదంటారు" అధికారం పొందినా కాంగ్రెస్ నాయకులు గాని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాని ఈ తిట్ల పురాణ పఠనం కొనసాగిస్తూనే అన్నారు.బిజెపి కొత్త తరం నాయకులు అధికార పదవులు పొందిన తర్వాత కొంత సంయమనం పాటిస్తున్నారు. బిజెపి సంజయ్ గాని రఘునందన్ రావు గారు గాని ఇతర నాయకులు గాని కొంత మర్యాద భాషకు మళ్ళారు.ఓడిన తర్వాత ఓ ఆరు నెలలు మౌనంగా ఉన్న బీఆరెఎస్ నాయకులు,ముఖ్యంగా కేటీఆర్ మళ్ళీ స్వరం పెంచారు.కాని తిట్ల భాష కొంత పాలిష్ చేసుకొని రంగంలోనికి దూకారు.తిట్లు బూతులు తగ్గినాయి గాని ఊకదంపుడు విమర్శలు జనానికి విసుగు పుట్టిస్తున్నాయి.మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ఒకరు మిగతా ఇద్దరిని విమర్శిస్తున్నారు.బిజెపి బిఆర్ఎస్ ఒక్కటని కాంగ్రెస్ అంటున్నదీ.ాదు కాంగ్రెస్ బిఆర్ఎస్ ఒక్కటేనని బిజెపి అంటున్నదీ.ాదు కాదు కాంగ్రెస్ బిజెపి ఒకటయ్యాయని బిఆర్ఎస్ పార్టీ అంటున్నది.ఎవరు ఎవరికి మిత్రులో, ఎవరు ఎవరికి శత్రువులో తేల్చుకోవడానికి జనాలు పి హెచ్ డి చేస్తున్నారు.నిన్న దినపత్రికల్లో ఒకే పేజీలో ఒక పార్టీ మిగతా రెండు పార్టీలు ఒక్కటని.. విమర్శించిన వార్తను చదివిన జనం ముక్కుపైన నుదుటి పైన చెయ్యి వేసుకుని తీవ్రంగా ఆలోచనలో పడ్డారు.ఈ తిట్ల దండకాలు, ఒకరు ఇంకొరిపై చేతబడులు చేసుకుంటున్న తీరుతో విరక్తి చెంది ప్రజలు సన్యాసం స్వీకరించే పరిస్థితి దాపురించింది అవకాశాలే ఎక్కువ కనిపిస్తున్నాయి.ఈ తిట్ల దండకాలు, విమర్శల చేతబడులు మానుకొని నాయకులు తమ గురించి,రాష్ట్రం గురించి ఆలోచిస్తే మంచిదని తెలంగాణ ప్రజలు కనిపించని దేవునిపై భారం వేసి బతుకుతున్నారు.ఈ రాజకీయ రంగుల రాట్నం లో పైకి కిందికి తిరిగే నాయకులు ఆనందపడుతుంటే, ఈ చమత్కారం చూస్తూ జనం తల తిరుగుతున్నది.ఇంతే రా...జకీయము తిరిగే రంగుల రాట్నం అంటూ జనం పాత సినిమా పాట పాడుకుంటున్నారు

## కారు ప్రమాదంలో మరణించిన శివకుమార్ కు నివాళులు

– మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ.
– అకౌంట్స్ అధికారి రామ్మోహన్





**కరపత్రం "కరుణాకర్ మల్లిగారి" మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.నవంబర్ 18**
మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో అటెండర్ (ఔట్ సోర్సింగ్) శనివారం కారు ప్రమాదంలో మరణించిన శివకుమార్ కు సోమవారం కలెక్టరేట్ లో అకౌంట్స్ అధికారి రాంమోహన్ తో కలిస జిల్లారెవెన్యూ అధికారి హరిప్రియ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ శివ కుమార్ చాలా బాధ్యతగా విధులు నిర్వహించేవారని, అతని ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. శివ కుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వ్యవసాయ కమిటీ డైరెక్టర్ ను సన్మానించిన పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

**కరపత్రం హుజురాబాద్/ ప్రతినిధి: నవంబర్ 18,**
హుజురాబాద్ పట్టణం సైదా పూర్ రోడ్డు లోని స్థానిక వెంకటేశ్వర మ్యారేజ్ బ్యూరో కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హుజురాబాద్ శాఖ అధ్యక్షులు చొల్లేటి మల్లారెడ్డి ఆధ్వర్యంలో హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మెంబర్గా ఎన్నికైన బండారు సదానందం ను ఘనంగా సత్కరించనైనది ఇట్టి కార్యక్రమంలో టా ప్రా కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన బిడ్డ బండారు సదానందం హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మెంబర్గా ఎన్నిక గావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ అట్టడుగు వర్గానికి చెందిన సామాన్య రైతులకు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందునట్లు తన వంతుగా నిరంతరం కృషి చేస్తూ అదేవిధంగా ప్రజలలో భాగమైన పెన్షనర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారాన్ని అందిస్తూ రైతులతో పాటు సామాన్య ప్రజలందరి మన్ననలను పొంది భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించినారు ఈ సందర్భంగా బండారు సదానందం మాట్లాడుతూ తనను సత్కరించిన పెన్షనర్ల అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ పెన్షనర్ల సమస్యల కొరకు తన వంతు పాటు పడతానని తెలిపినారు కార్యక్రమంలో బొంగోని వెంకటయ్య సయ్యద్ మునూరుద్దీన్ సందేల వెంకన్న రాయి కంటి రామకృష్ణయ్య తాటిపాముల కనుకయ్య దాసరి మల్లేష్ దొంత హరికిషన్ గాజా బుచ్చి రాజం తాళ్లపల్లి రామకృష్ణయ్య అంతడుపుల సారయ్య మూల మోహన్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు

## పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా..... ముదిరాజ్ గుండెల్లో చైతన్య ఎజెండా....

– ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు బిక్షపతి..

**కరపత్రం శంకర పట్నం నవంబర్ 18**
పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా. ముదిరాజ్ గుండెల్లో చైతన్య జెండా ఎగురవేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు, లింగాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పోలవేణి బిక్షపతి ముదిరాజ్ కుల బాంధవులకు పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం , శంకరపట్నం మండల కేంద్రంలో ముదిరాజు మహాసభ దశాబ్ది ఉత్సవ గోడపత్రికలను బిక్షపతి మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడారు. తెలంగాణలో 2014లో పురుడు పోసుకున్న, తెలంగాణ ముదిరాజ్ మహాసభ సంఘం. ముదిరాజ్ హక్కుల సాధన కోసం అనేక పోరాటాలను కొనసాగిస్తుందని ప్రత్యేక రాష్ట్రంలో ముదిరాజ్ కులస్తుల మత్స్య కార్మికుల ఆర్థిక ఎదుగుదల కోసం ప్రత్యేక రాష్ట్రంలో ముదిరాజ్ కులస్తులకు చెరువులలో ప్రభుత్వము ఉచితంగా, చేప పిల్లలను, ఇతర సంక్షేమ పథకాలను సంఘం పోరాటం లో భాగంగానే సాధించుకోవడం అందజేయడం జరిగిందని, నవంబర్



21న మత్స్యకారుల దినోత్సవం. తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో పట్టణాల్లో జిల్లా కేంద్రంలో ముదిరాజ్ జెండాలను ఆవిష్కరించి పండగ జరుపుకోవాలని, మండల కేంద్రంలో నిర్వహించే వేడుకలకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గల ముదిరాజ్ సంఘం నాయకులు కుల బాంధవులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసి ముదిరాజ్ కులస్తుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మహిళా విభాగం కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, శంకరపట్నం మండలం జర్నలిస్టు పల్లె స్వరూప, జిల్లా డైరెక్టర్ అరిగే ప్రభాకర్, మహాసభ యూత్ విభాగం అధ్యక్షులు రెడ్డి సురేష్, మహాసభ నియోజకవర్గ ఇన్చార్జ్ గూళ్ల రాజు, మొలంగూర్ మత్స్య సహకార సంఘం అధ్యక్షులు గుళ్ల పాపయ్య, నాయకులు గూళ్ల రమేష్, ఎడ్ల శ్రీనివాస్, ఎడ్ల సారయ్య, గౌరవేణి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

– ముఖ్య అతిథులుగా హాజరైన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
– తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
– కాంగ్రెస్ పార్టీ టి పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
– కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి
– ప్రజా ఉద్యమ నాయకుడు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి నీలం మధు ముదిరాజ్

**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి తో కలిసి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై కార్యకర్తలకు వారు దిశా నిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కార్యకర్తలు అంతా సైనికుల పనిచేసి కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి వెళ్లేలా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావడం జరిగింది.




# నవంబర్ 21న తండేల్ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్..



టాలీవుడ్ స్టార్ హీరో అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం "తండేల్" అనే సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాకి ప్రముఖ డైరెక్టర్ చందూ మొండేటి దర్శకత్వం వహిస్తుండగా టాలీవుడ్ రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. ఇక ఈ సినిమాలో హీరోయిన్ గా మలయాళ బ్యూటీ సాయి పల్లవి నటిస్తోంది. అయితే ఈ సినిమా క్రిస్మస్ కానుకగా రిలీజ్ కావలసి ఉండగా షూటింగ్ పూర్తవకపోవడంతో వచ్చే ఏడాది ఫిబ్రవరికి వాయిదా పడింది.అయితే తండేల్ సినిమాలోని ఫస్ట్ సింగిల్ బుజ్జితల్లి అనే పాటని నవంబర్ 21న రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. అయితే ఆమధ్య రిలీజ్ చేసిన టీజర్ లో బుజ్జితల్లి వచ్చేత్తున్నా కదే.. నవ్వే అనే డైలాగ్ బాగా ఫేమస్ అయ్యింది. దీంతో బుజ్జి తల్లి సాంగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ఈ విషయం ఇలా ఉండగా ఈ సినిమాలో నాగచైతన్య చేపలు పట్టే జాలరి యువకుడి పాత్రలో నటించాడు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళంకి చెందిన యువకుడు చేపల వేటకి వెళ్ళి సముద్ర తీరంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు..?, చివరికి ఇంటికి తిరిగొచ్చాడా..? లేదా అనే ఇంట్రెస్టింగ్ స్టోరీ లైనప్ తో చందూ మొండేటి ఈ సినిమాని తెరకెక్కిస్తున్నాడు. టాలీవుడ్ ప్రముఖ సినీ నిర్మాత బన్నీ వాసు గీతా ఆర్ట్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నాడు.

# వైల్డ్‌ఫైర్ మొదలైంది..

## 'పుష్ప2' ట్రైలర్‌పై రాజమౌళి పోస్టు



ప్రస్తుతం సోషల్ మీడియాలో పుష్పగాడి రూల్ నడుస్తోంది. ఎక్కడ చూసినా పుష్ప2 ట్రైలర్‌లోని అంశాల గురించే మాట్లాడుకుంటున్నారు. భారీ అంచనాల మధ్య విడుదలైన 'పుష్ప 2: ది రూల్' ట్రైలర్ వాటిని అందుకొని మంచి వ్యూస్‌తో ట్రెండ్ అవుతోంది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్ర ట్రైలర్‌పై ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు . 'ఇది నిజంగానే వైల్డ్ ఫైర్' అంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. వారందరికీ పేరుపేరునా అల్లు అర్జున్ థ్యాంక్స్ చెబుతున్నారు. తాజాగా రాజమౌళి కూడా స్పందించారు. ఇక బన్నీ సరసన శ్రీవల్లిగా రష్మిక కనిపించనున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతోంది.'వైల్డ్ ఫైర్.. డిసెంబర్ 5 కోసం ఎదురుచూస్తున్నా' అని కిరణ్ అబ్బవరం ట్వీట్ చేయగా.. దీనిపై బన్నీ స్పందించారు. 'థ్యాంక్యూ మై బ్రదర్. 'క' సినిమాతో విజయం అందుకున్నందుకు నీకు అభినందనలు. సారీ.. బిజీగా ఉండటం వల్ల సినిమా చూడలేకపోయా. తప్పకుండా సినిమా చూసి నీకు కాల్ చేస్తా" అని పేర్కొన్నారు.పాట్నాలో వైల్డ్‌ఫైర్ మొదలైంది.. అది దేశమంతటా విస్తరిస్తోంది. డిసెంబర్ 5న చెలరేగుతోంది. పార్టీ కోసం వేచిఉండలేకపోతున్నా పుష్ప..– రాజమౌళి

ట్రైలర్‌లోని మాస్ ఎలిమెంట్స్ అదిరిపోయాయి. మరో బ్లాక్‌బస్టర్ సిద్ధమవుతోంది.. చిత్రబృందానికి అభినందనలు – రిషబ్‌శెట్టి

ప్రతి ఫ్రేమ్ మీ కృషిని తెలియజేస్తుంది. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ తపన కనపడుతోంది. మీరు దీనికోసం పడిన కష్టం. మీ శ్రమ.. దీని కోసం వెచ్చించిన సమయం అన్నీ సినిమాపై మీకున్న ప్రేమకు స్పష్టమైన సాక్ష్యాలు. హ్యాట్సాఫ్ డియర్ అల్లు అర్జున్ – హరీశ్ శంకర్

ఇది నిజంగానే వైల్డ్‌ఫైర్. అల్లు అర్జున్, సుకుమార్‌లు మరోసారి మేజిక్ చేయడానికి సిద్ధమయ్యారు. ఇది పవర్ ప్యాక్డ్ ట్రైలర్. బిగ్ స్క్రీన్‌పై సినిమా చూసేందుకు వేచిచూస్తున్నా – అనిల్ రావిపూడి

తిరుగుబాటును విప్లవంగా మార్చిన వ్యక్తి తిరిగి వచ్చాడు. అప్పటికంటే ఎక్కువ బిగ్గరగా, ఉగ్రంగా, ఘోరంగా ఉన్నాడు. ఈ పవర్‌హౌస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. డిసెంబర్ 5 కోసం ఎదురుచూస్తున్నా – ప్రశాంత్ వర్మ

ఇప్పుడు చెప్పండ్రా అబ్బాయిలు.. నేషనల్ అనుకుంటారా, ఇంటర్నేషనల్ అనుకుంటారా..– దర్శకుడు బుచ్చిబాబు

'పుష్ప2' ట్రైలర్ ఓ బ్లాక్‌బస్టర్. ఐకాన్‌స్టార్ ఈ చిత్రం కోసం ఎంత కష్టపడ్డారో తెలుస్తోంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ సుకుమార్ సర్ ప్రతిభ కనపడుతోంది. టీమ్‌కు నా శుభాకాంక్షలు – బాబీ



# అతడు జెంటిల్‌మ్యాన్.. సినీ హీరోలపై మీనాక్షి చౌదరి సరదా కామెంట్స్..

'మెకానిక్ రాకీ' అంటూ విష్వక్ సేన్‌తో కలిసి అలరించేందుకు సిద్ధమయ్యారు నటి మీనాక్షి చౌదరి. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 22న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో టీమ్ తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. అందులో మీనాక్షి మాట్లాడుతూ.. కొందరి హీరోలపై తన అభిప్రాయన్ని సరదాగా చెప్పారు. తన సహనటుల నుంచి తాను నేర్చుకున్న విషయాలు పంచుకున్నారు.'మహేశ్‌బాబు క్రమశిక్షణగా ఉంటారు. కోలీవుడ్ హీరో విజయ్ ఎప్పుడూ ఒకేలా ఉంటారు. దుల్కర్ సల్మాన్ వినయం అంటే నాకు ఇష్టం. వరుణ్ తేజ్‌ది పూర్తిగా జెంటిల్‌మ్యాన్ నేచర్. ఇక విష్వక్‌సేన్ ఎప్పుడూ సరదాగా ఉంటారు. ఎనర్జిటిక్‌గా ఉంటూ సెట్‌లో సందడి క్రియేట్ చేస్తుంటారు' అని చెప్పారు. ఇక ఈ వేడుకలో శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ.. గతంలో తాను విష్వక్‌సేన్ 'ఫలక్‌నుమా దాస్'ను రిజెక్ట్ చేయడానికి కారణాన్ని వివరించారు. ఆ స్క్రిప్ట్ తనకు నచ్చలేదన్నారు. నటీనటులు సినిమాలను ఎంపిక చేసుకునే క్రమంలో అలా తిరస్కరించడం సహజమన్నారు. కానీ.. అప్పటినుంచి మంచి స్క్రిప్ట్ ఉంటే విష్వక్‌తో నటించే అవకాశం కోసం ఎదురుచూసినట్లు చెప్పారు. అప్పటికంటే ఇప్పుడు విష్వక్ బాధ్యతగా ఉన్నారని ప్రశంసించారు.యాక్షన్ కామెడీ ఫిల్మ్‌గా 'మెకానిక్ రాకీ' రూపొందింది. రామ్ తాళ్లూరి నిర్మించారు. సునీల్, నరేశ్ వి.కె తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని విష్వక్ అన్నారు. "నాకింత మంచి జీవితాన్నిచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మేమంతా ప్రాణం పెట్టి ఈ చిత్రం తీశాం. ఈ మధ్యే సినిమా చూసుకున్నా. చాలా మంచి చిత్రం చేశామనిపించింది. నేనిప్పటివరకు చేసిన సినిమాలన్నింటి కంటే చాలా వెరైటీగా ఉంటుంది. ఐదు నిమిషాలు కూడా ఎక్కడా బోర్ కొట్టదు. ఒకరోజు ముందుగానే ప్రీమియర్లు వేస్తున్నాం" అన్నారు.

# ఆల్ఫా అవకాశంతో ఎగిరి గంతేశా!

"చిత్రపరిశ్రమలో ఒక మామూలు నటిగా కాదు.. యాక్షన్ స్టార్‌గా ఉండాలనుకుంటున్నాన"ని అంటోంది బాలీవుడ్ కథానాయిక శార్వరీ వాఘ్. ప్రస్తుతం ఈమె అలియా భట్‌తో కలిసి 'ఆల్ఫా' సినిమాలో నటిస్తుంది. యశ్‌రాజ్ ఫిలింస్



నిర్మిస్తున్న ఈ స్పై థ్రిల్లర్ చిత్రాన్ని శివ్ రావేల్ తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శార్వరీ.. యాక్షన్ చిత్రాల పట్ల తనకున్న ఇష్టాన్ని పంచుకుంది. "బాల్యం నుంచే నేను నా సోదరితో కలిసి యాక్షన్ సినిమాల్ని ఆసక్తిగా చూసేదాన్ని. అన్నింటికంటే ఈ జానర్‌ని ఎక్కువగా ఇష్టపడతా. అందుకే నాకు 'ఆల్ఫా'లో అవకాశం వచ్చినప్పుడు ఎగిరి గంతులేశా. యాక్షన్ చిత్రాల్లో భారీ సన్నివేశాలు చేయాలనే నా కోరికను ఇప్పుడు ప్రత్యక్షంగా అనుభవిస్తున్నా. చాలా సరదాగా ఉంది. కానీ శారీరకంగా ఎక్కువ కష్టపడాల్సి వస్తోంది. 'ఆల్ఫా'లో ప్రేక్షకులు నన్ను కచ్చితంగా ఇష్టపడుతారని ఆశిస్తున్నా. కేవలం రెండు సన్నివేశాలు, మూడు ప్రేమపాటల్లో నటించే నటిగా కాకుండా భవిష్యత్తులో యాక్షన్ స్టార్‌గా ఉండాలనుకుంటున్నా" అని చెప్పుకొచ్చింది.